పెసర రైతుకు వర్షాఘాతం

- 20 వేల ఎకరాల్లో నష్టం
- పరిహారం కోసం ఎదురుచూపు

దుగ్గొండి : ఈసారి పెసర రైతుకు వర్షాఘాతం తప్పలేదు. పెసర రైతులను మొదటి నుంచి కష్టాలు వెంటాడుతున్నాయి. ప్రారంభంలో రాయితీ విత్తనాలు లభించలేదు. రైతులు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కొనుగోలు చేసి సాగు చేశారు. అనంతరం నెల రోజులుగా వర్షాలు పెసర రైతును నిండా ముంచాయి. ప్రకృతి ప్రకోపంతో ఏటా రైతులు నష్టపోతున్నారు. విత్తనాలు వేసేటప్పుడు వర్షాలు లేకపోవడం, పంట చేతికొచ్చే సమయంలో ఎడతెరిపి లేని వర్షాలు తీరని నష్టాన్ని తెచ్చిపెట్టాయి. పప్పు దినుసులకు మార్కెట్‌లో డిమాండ్ ఉండటం, రెండో పంటగా మొక్కజొన్న సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందనే ఆశతో ఈసారి జిల్లావ్యాప్తంగా 20 వేల ఎకరాలలో రైతులు పెసర పంట సాగు చేశారు. పంట ప్రస్తుతం చెట్టునిండా కాయలు కాసి కోత దశకొచ్చింది. అంతలోనే నెల రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో కాయల్లోని గింజలు అధిక తేమతో చెట్టుపైనే మొలకలొస్తున్నాయి. రైతుకు కనీసం కిలో దిగుబడి కూడా రాని దుస్థితి నెలకొంది. ఎకరాకు రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టగా పైసా కూడా రాని పరిస్థితిలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 4–5 క్వింటాళ్ల దిగుబడి వచ్చి రూ.40–50 వేల ఆదాయం వస్తుందని ఆశించగా తమకు చిల్లిగవ్వ రాకుండా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ అధికారులతో సర్వే చేయించి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.




వర్షాలకు దెబ్బతిన్న పంట (ఇన్‌సెట్లో) చేనుపైనే మొలకలు వస్తున్న పెసర గింజలు

నాలుగెకరాల్లో సాగు చేశా



నేను 4 ఎకరాల్లో పెసర సాగు చేశా. కాపు బాగా వచ్చింది. హార్వెస్టర్‌తో కోయాలనుకున్న మరుసటి రోజే వర్షాలు మొదలయ్యాయి. దాదాపు రూ.1.50 లక్షల ఆదాయం వస్తుందనుకున్నా. సుమారు 15 రోజులు గడచినా వర్షాలు కురుస్తుండడంతో చేనులోనే గింజలు మొలకలొస్తున్నాయి. భూమిలో కలియ దున్నడమే తరువాయి. ప్రభుత్వం స్పందించాలి. పరిహారం ఇవ్వాలి.

- సద్ది మల్లారెడ్డి, రైతు, నాచినపల్లి

ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలి



పత్తి సాగు చేసే పలువురు రైతులు వర్షాకాలంలో పత్తి గిట్టుబాటు కాక వానాకాలంలో పెసర సాగు చేస్తున్నారు. అధిక దిగుబడితోపాటు భూసారం పెరిగి రెండో పంటగా మొక్కజొన్న వేస్తే లాభాలొస్తాయని ఆశించారు. పంట చేతికొచ్చే క్రమంలో వర్షాలతో దెబ్బతిని పెట్టుబడి సైతం రాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం బాధిత రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి.

- పుచ్చకాయల కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, రైతు సంఘం

మండల అధ్యక్షుడి తొలగింపు తగదు



రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో నాయకులు

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీకి చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు చొక్కం శ్రీనివాస్‌ను అభియోగాలు, కారణాలు లేకుండా పదవి నుంచి తొలగించడం తగదని నాయకులు అన్నారు. శ్రీనివాస్‌తోపాటు పార్టీ మండల ఉపాధ్యక్షుడు తుమ్మనపల్లి శంకర్‌రావు, కోశాధికారి పాట్ర తిరుపతిరెడ్డి, తదితరులు హైదరాబాద్‌లోని కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును ఆదివారం కలిసి మాట్లాడారు. సమస్యను విన్నవించారు. నిజాయతీగా పని చేస్తున్న నాయకుల మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్యలను ఖండిస్తున్నామని చెప్పారు. చొక్కం శ్రీనివాస్‌ను కొనసాగించాలని కోరారు. తొలుత రామచంద్రరావుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. రాంచందర్‌రావును కలిసిన వారిలో అసెంబ్లీ కన్వీనర్ ముల్క ప్రసాద్, జిల్లా కౌన్సిల్ మెంబర్ జాన్ విక్రమ్, జిల్లా అధికార ప్రతినిధి నల్ల సాంబరాజు, స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ బాలరాజు, నాయకులు ఆరకట్ల ప్రవీణ్, బూర్గుల యుగేందర్, వెంకన్న తదితరులున్నారు.

రేషన్ కార్డులను వినియోగించుకోవాలి



లబ్ధిదారులకు రేషన్ కార్డుల ప్రతులను పంపిణీ చేస్తున్న ప్రవీణ్‌కుమార్

- యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ప్రవీణ్

నర్సంపేట : నూతన రేషన్ కార్డులను ప్రజలు వినియోగించుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కందిక ప్రవీణ్‌కుమార్ కోరారు. చెన్నారావుపేట మండలంలోని నంబర్ వన్ కాలనీకి చెందిన పలువురికి రేషన్‌కార్డులు మంజూరు కాగా ఆదివారం ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. కార్డులు ఇచ్చిన ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆకులపెల్లి అనూష, పసునూరి మమత, మీస మానస, చింత సునీత, అనుముల ఆగమ్మ, చిలుక సుమ, ఈసంపెల్లి సౌందర్య, కన్నం పూజిత, సాధు శిరీష, బొమ్మకంటి స్వప్న, కూస కల్యాణి, వేల్పుల దీవెన, కన్నం రమాదేవి, సాధు శిరీష, బొల్లెపల్లి భవాని, జంగిలి మౌనిక, ఇసంపల్లి ఐలయ్య, జంగిలి సంపత్, ఆకులపల్లి సుదర్శన్, ఆకులపల్లి సురేష్, తుమ్మలప్లి సువర్ణ, తుమ్మలపల్లి సురేశ్, చిలక రాజు, చిలుక నర్సయ్య, కేశపాక మైసయ్య, జంగిలి భాస్కర్, వెంకటస్వామి, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రజెండా నీడలోనే 'సాయుధ పోరాటం'

- సీపీఐ సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌రావు, నాయకులు

నర్సంపేట : ఎర్రజెండా నీడలోనే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిగిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యదర్శి అయిత యాకయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షణ లేని, నిజామ్ మూకలు ప్రజలను చిత్రహింసలకు గురి చేసిన క్రమంలో ఆంధ్ర మహాసభ ఏర్పడి పోరాటాలు చేసిందన్నారు. పేదలకు 10 లక్షల ఎకరాల భూములను పంచినట్టు తెలిపారు. నాటి పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తోందని చెప్పారు. నాడు బీజేపీ ఆనవాళ్లు కూడా లేవన్నారు. హైదరాబాద్‌లో స్మృతి వనం ఏర్పాటు చేయాలని, పోరాటయోధుల విగ్రహాలు ట్యాంక్‌బండ్‌పై ప్రతిష్ఠించాలని, తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాషుమియా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పంజాల రమేశ్, నాయకులు మియాపురం గోవర్దన్, పాలక కవిత, పిట్టల సతీశ్, గద్దం నాగరాజు, సాంబయ్య, అక్కపెల్లి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రబెల్లిపై విమర్శలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి పూస మధు

రాయపర్తి : బీఆర్‌ఎస్‌లో మాజీ మంత్రి దయాకర్‌రావు వెంట ఉండి కాంగ్రెస్‌లో చేరాక ఆయనపైనే విమర్శలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు యూరియా కోసం స్వచ్ఛందంగా ధర్నా చేయగా మాజీ మంత్రి దయాకర్‌రావు పాల్గొంటే దాన్ని కాంగ్రెస్ నాయకులు రాజకీయ ధర్నాగా మాట్లాడడం సిగ్గు చేటన్నారు. 'ఆధారాలతో సహా ఇస్తున్నాం, మీరు ఎలా మాట్లాడారో.. మేము కట్టుబడి ఉంటాం.. రాయపర్తి బస్టాండ్‌లో ముక్కు నేలకు రాస్తాం.. మీరు వస్తారా..' అన్నారు. దయాకర్‌రావు రైతుల పక్షాన ధర్నా చేస్తే కాంగ్రెస్ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. రైతుల యూరియా కష్టాలను తీర్చి మాట్లాడాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముద్రబోయిన సుధాకర్, మాజీ సర్పంచ్ గారె నర్సయ్య, మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్, చెడుపాక కుమారస్వామి, రాము, చిన్నాల ఉప్పలయ్య, పోగులకొండ వేణు, లేతాకుల రంగారెడ్డి, పెద్దగొల్ల రాజు, చిలువేరు సాయి, గజవెల్లి ప్రసాద్, చందు సతీశ్, మైస వెంకటేశం, సింహాద్రి, లక్ష్మణ్, ఉబ్బని మధు, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



పాత కమిటీని సన్మానిస్తున్న నాయకులు

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి గ్రామంలో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ కార్యవర్గాన్ని వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్రబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెన్నబోయిన కుమార్, ఉపాధ్యక్షుడిగా కత్తి సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కూతాటి కృష్ణమూర్తి, కోశాధికారిగా కత్తి రవి ఎన్నికయ్యారు. అలాగే యూత్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే గణపతి ఉత్సవ కమిటీ సభ్యులుగా చెన్నబోయిన మధు, శ్యామ్, మహేశ్, సాగర్, శ్రీనివాస్, మామిండ్ల పరమేశ్, సిరికొండ సురేశ్, కొత్తపల్లి ఉదయ్ కిరణ్, బెల్లి నాగరాజు, బెల్లి సురేశ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిని, కార్యవర్గాన్ని గ్రామస్తులు, ప్రముఖులు అభినందించారు. అనంతరం పాత కమిటీని నాయకులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చెన్నబోయిన సారయ్య, కత్తి రాజు, చెన్నబోయిన దిలీప్, సభ్యులు రాజు, విజయ్, రాజు, ఉప్పలయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

కంతమహేశ్వరుడి పండుగకు ఆహ్వానం



ఎమ్మెల్యే మాధవరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటేశ్వర్లు, నాయకులు

నర్సంపేట : స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కంతమహేశ్వరస్వామి పండుగకు రావాలని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని నాయకులు ఆహ్వానించారు. గౌడ గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ వేముల సాంబయ్య ఆధ్వర్యంలో కులపెద్దలు, నాయకులు ఎమ్మెల్యే మాధవరెడ్డిని క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పండుగ రావాలని కోరారు. కార్యక్రమంలో గౌడ గీత పారిశ్రామిక ప్రధాన కార్యదర్శి మద్దెల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గాదగోని సాంబయ్య, గిరగాని కిరణ్, డైరెక్టర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, సురేశ్, వేముల కృష్ణ, గిరగాని రమేశ్, నాగెల్లి ప్రసాద్, చుక్క రవి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు లేక ఇబ్బంది పడుతున్నాం

చెన్నారావుపేట మండలంలోని ఎల్లాయిగూడెంలో రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని మాధవనగర్ కాలనీవాసులు తెలిపారు. ఈ మేరకు కాలనీవాసులు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని ఆదివారం కలిసి మాట్లాడారు. సమస్యను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, క్లస్టర్ ఇన్‌చార్జ్ కేతిడి వీరారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రూపిక శ్రావణ్‌కుమార్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు పోతరాజు నర్సయ్య, ఎల్లాయగూడెం గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ మగ్గిడి సాంబయ్య, గ్రామ కార్యదర్శి టేకుల సాయిబాబు, దాసరి సాంబయ్య, గడికొప్పుల సాంబయ్య, దాసరి రాజు, కాలేపాక ఎల్లస్వామి, రూపిక సుమన్, సింగారపు బాబు, తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ విచారణ చేపట్టాలి



గీసుకొండ : గ్రామపంచాయతీ తీర్మానాలు లేకుండా, అధికారులు కుమ్మక్కై కొమ్మాల అంగడి రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదని పలువురు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు వారు హనుమకొండలోని మంత్రి కొండా సురేఖ నివాసంలో మంత్రిని కలిసి ఫిర్యాదు చేశారు. మంత్రి విచారణకు ఆదేశించారని నాయకుడు వీరగోని రాజ్‌కుమార్ తెలిపారు.

తండాలకు రోడ్లు వేయించాలి



సంగెం : మండలంలోని పలు తండాలకు రోడ్లు వేయించాలని కోరుతూ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్‌కు బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర నాయకుడు సపావట్ మహేందర్ ఆదివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడారు. బీకోజీనాయక్ తండా నుంచి బాలునాయక్ తండాకు వెళ్లే రోడ్డు, బ్రిడ్జి త్వరగా నిర్మించాల్సి ఉందన్నారు. ఎల్గూర్ స్టేషన్ నుంచి తిమ్మాపూర్ ప్రధాన రహదారి 3 కిలోమీటర్ల మేర అధ్వానంగా తయారైందని చెప్పారు. వెంటనే నూతన బీటీ రోడ్డు వేయించాలని కోరారు. కాకతీయుల కాలం నాటి చరిత్ర కలిగిన ఎల్గూర్ గుట్ట మొరం అక్రమ తరలింపు అడ్డుకోవాలన్నారు.

కరాటేలో పతకాలు



నర్సంపేట రూరల్ : హైదరాబాద్‌లో విక్షం షోటోకాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నర్సంపేట మండలం మహేశ్వరంలోని శివాని పబ్లిక్ స్కూల్‌కు చెందిన 13మంది విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ఇండియా చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ ఆర్.శ్రీనివాస్, స్కూల్ కరస్పాండెంట్ గిరగాని రాహుల్ వర్మ వివరాలు వెల్లడించారు. విద్యార్థులు బి.సాత్విక్, ఎం.విష్ణు, ఎస్.జశ్వంత్, సాయి బంగారు పతకాలు సాధించగా ఎల్.విశాల్, ఎల్.లోహిత్, ఎల్.లలిత్ నాయక్, బి.హర్షన్ వెండి పతకాలు, ఎల్.ప్రభా, ఎ.సాయివరుణ్ శ్రీతేజ్, ఎం.వంశీ కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ మొలుగూరి సురేందర్ అభినందించారు.

గౌడ సంఘం కమిటీకి సన్మానం



నర్సంపేట : కమిటీని సన్మానిస్తున్న జర్నలిస్టులు

నర్సంపేట : పట్టణ గౌడ సంఘం కమిటీ ఇటీవల ఎన్నికైన క్రమంలో స్థానిక గౌడ జర్నలిస్టులు ఆదివారం సన్మానించారు. అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మద్దెల శ్రీనివాస్‌తోపాటు సభ్యులను శాలువాలతో సత్కరించారు. అనంతరం గౌడ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడారు. గౌడ కులస్తులు సంఘం అభివృద్ధికి పాటుపడాలని కోరారు. సంఘం ఆధ్వర్యంలో అక్టోబర్ 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కంతమహేశ్వరస్వామి సూరమాంబదేవి, రేణుక ఎల్లమ్మతల్లి, జమదగ్ని బోనాల మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పట్టణ జర్నలిస్టులను గౌడ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం ఉపాధ్యక్షుడు గాదగోని సాంబయ్య, ఆర్థిక కార్యదర్శులు నాతి సదానందం, గిరగాని కిరణ్, డైరెక్టర్లు తాళ్లపెల్లి శ్రీనివాస్, మొగలగాని సురేశ్, వేముల కృష్ణ, గిరగాని రమేశ్, నాగెల్లి ప్రమోద్, చుక్క రవి, సభ్యులు తాళ్లపెల్లి చంద్రమౌళి, తాటేటి లక్ష్మణ్, కోల చరణ్, జర్నలిస్టులు కారుపోతుల విజయ్‌కుమార్, రడం శ్రీనివాస్, బుర్ర వేణు, కందుల శ్రీనివాస్, జూలూరి హరిప్రసాద్, తడుక రమేశ్, వడ్లకొండ పవిత్రన్, వడ్లకొండ రాజ్‌కుమార్, కొయ్యడి సనత్, గోపగాని శోభన్, బండారి సుమంత్, తదితరులు పాల్గొన్నారు.



గీసుకొండ : రాజమౌళిని సన్మానిస్తున్న చైర్మన్

కూసం రాజమౌళికి..

గీసుకొండ : జాతీయ ఆదర్శ గ్రామంగా గుర్తింపు పొందిన మండలంలోని గంగదేవిపల్లి మాజీ సర్పంచ్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళిని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ప్రతినిధులు ఆదివారం సన్మానించారు. 'అన్నదాతలకు ఆత్మీయ సత్కారం' పేరుతో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాజమౌళిని రిటైర్డ్ జేడీ లక్ష్మీనారాయణ, సంస్థ చైర్మన్ పల్నాటి రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్, అశోక్‌కుమార్ తదితరులు శాలువాలతో సన్మానించారు.

కాంగ్రెస్‌లో చేరలేదనే సొసైటీ చైర్మన్ల తొలగింపు

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : కాంగ్రెస్‌లో చేరడం లేదనే నెపంతో సొసైటీ చైర్మన్లను తొలగించడం దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని ఆయన నివాసగృహంలో నియోజకవర్గంలోని పలువురు సొసైటీ చైర్మన్లతో ఆదివారం ధర్మారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 14న పీఏసీఎస్ పాలకవర్గాల పొడిగింపు జరిగినప్పటి నుంచి ఇతర పార్టీలకు చెందిన చైర్మన్లను కాంగ్రెస్ పార్టీలో చేరాలని అధికార పార్టీ నేతలు, అధికారులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. పార్టీ మారని చైర్మన్లను పొంతనలేని సాకులతో తొలగించడం ప్రభుత్వ నిరంకుశ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్న సభ్యులను తొలగించడం దారుణమన్నారు. ఓటమి భయంతోనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదని అభిప్రాయపడ్డారు. రైతులకు సరిపడా యూరియా ఇవ్వడం చేతకాని ప్రభుత్వం బీరాలు పలుకుతోందని ఎద్దేవ చేశారు. ప్రస్తుత సొసైటీ పాలకవర్గాలను రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని సవాల్ విసిరారు. సమావేశంలో వివిధ సంఘాల చైర్మన్లు, సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఖిలా వరంగల్ : రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ తెలిపారు. ఈనెల 17న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరానికి సమాజంలోని ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. కరీమాబాద్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొరిగం నాగరాజు ఆధ్వర్యంలో సేవా పక్షం పేరుతో జిల్లా కోకన్వీనర్ కర్నె రవీందర్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి డాక్టర్ వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17న రక్తదాన శిబిరం, మొక్కలు నాటడం, దీన్‌దయాల్‌కు నివాళులర్పించటం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఆకుతోట రాజు, రాధారపు మహేశ్, మందాడి సందీప్, కిరణ్, దేవేందర్, స్వరూప, లావణ్య, లలిత, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు బాధ్యతల స్వీకరణ

దుగ్గొండి : రెవెన్యూ రికార్డుల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నియమించిన గ్రామ పాలన అధికారులు నేడు గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు. మండల పరిధిలో 16 రెవెన్యూ గ్రామాలుండగా 14 మంది నియమితులై తహసీల్దార్ కార్యాలయంలో రిపోర్టు చేశారు. మరో ఇద్దరు త్వరలో విధుల్లో చేరనున్నారు. పొనకల్‌కు యాకలక్ష్మి, వెంకటాపురానికి యాదమ్మ, అడవి రంగాపురానికి సయ్యద్ జాన్, ముద్దునూరుకు యాకూబ్ అలీ, చలపర్తికి ఉదయ్, తొగర్రాయికి ఫర్హానా బేగమ్, మహ్మదాపురానికి సురేశ్, మల్లంపల్లికి వంశీకృష్ణ, నాచినపల్లికి రమేశ్, లక్ష్మీపురానికి క్రాంతికుమార్, దుగ్గొండి-1కి విక్రమ్, దుగ్గొండి-2కు రమేశ్, మందపల్లికి అనిల్, తిమ్మంపేటకు శ్రీనివాస్ నియమితులయ్యారు.

లంబాడీ జేఏసీ ఎన్నిక



జాటోతు సదర్‌లాల్



గుగులోతు కిషన్

ఖానాపురం : మండల కేంద్రంలో లంబాడీ జేఏసీని ఆదివారం ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా గుగులోతు కిషన్‌నాయక్, జాటోతు సదర్‌లాల్, ముఖ్య సలహాదారులుగా బాలునాయక్, జాటోతు బాలునాయక్, కోకన్వీనర్లుగా భూక్య వెంకన్న, ఆంగోతు రమేశ్, బోడ పూల్‌సింగ్, గుగులోతు సుమన్‌నాయక్, తేజావత్ రెడ్డి, బాధావత్ బాలకిషన్, రమేశ్, భిక్షపతితోపాటు 35 మంది సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం కన్వీనర్లను నాయకులు, సభ్యులు అభినందించారు.

నియామకం



సంగెం : మండలంలోని ఆశాలపల్లికి చెందిన బొల్లబోయిన రాజేందర్‌ను జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) మండల ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు మొగుళ్ల భద్రయ్య ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ ద్వారా పేదలకు న్యాయం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మెరుగు రాంబాబు, ప్రధాన కార్యదర్శి సంగం రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం సాయం

నర్సంపేట : పట్టణంలోని 18వ వార్డుకు చెందిన పంజరబోయిన సోమయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ బత్తిని రాజేందర్ ఆదివారం క్వింటా బియ్యం సాయంగా అందజేశారు. తొలుత సోమయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మృతి కుమారుడైన కళాకారుడు శ్రీనివాస్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో కాలనీవాసులు లాదెళ్ల యాకయ్య, రాయపురం రాజు, గని, డేగల రాము, తుమ్మిడి అశోక్, రాజు, వాంకుడోతు వంశీ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన దుండి సారంగపాణి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని అతడితో కలిసి పదో తరగతి చదువుకున్న మిత్రులు ఆదివారం కలిసి పరామర్శించి ఆర్థికసాయం అందించారు. హన్మకొండ ఆర్‌డీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లేశం క్వింటా బియ్యం సాయంగా అందజేశారు. సారంగపాణి మృతి బాధాకరమన్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వెంపటి నరేందర్, సముద్రాల శ్రీనివాస్, రంగు జనార్దన్, వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, రవీందర్, బాసాని సంజీవ, వడ్లకొండ శ్రీనివాస్, భక్తి సంజీవ, బరిగెల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

శివాల మర్రిని పునరుద్ధరించాలి

ఐనవోలు : సుమారు 100 ఏళ్లకుపైగా చరిత్ర కలిగి మండల కేంద్రంలో శివాల మర్రి దేవతా వృక్షంగా స్థానికులు పిలుచుకునే మర్రి చెట్టు ఆదివారం సాయంత్రం నేలకొరిగింది. పూర్వం ప్రఖ్యాత మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తులు మెదట శివాల మర్రిని దర్శించుకుని ప్రదక్షిణ చేసిన తర్వాతే మల్లన్నను దర్శించుకునే వారని స్థానికులు చెబుతారు. ఇప్పటికీ ఆలయానికి వచ్చే శివశక్తులు మొదట దేవతా వృక్షం వద్దకు వెళ్లి ఆశీర్వాదం తీసుకుని వారి వేషధారణ మార్చుకుని గజ్జెల లాగులు కట్టుకుని మల్లన్న దైవ దర్శనానికి వస్తుంటారు. ఇంతటి నేపథ్యం కలిగిన శివాల మర్రిచెట్టు ఇటీవల కురిసిన వర్షాలకు నేలకొరగడం కలిచివేసిందని ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ సీనియర్ అర్చకుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వెంటనే నిపుణుల సలహాతో భారీ యంత్రాల సాయంతో శివాల మర్రిని మరోచోట పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.